క్లుప్తంగా

పలు మండలాల్లో అకాలవర్షం

వర్ని/రుద్రూర్ : వర్ని, కోటగిరి, రుద్రూర్ మండలాల్లో సోమవారం సాయంత్రం వర్షం కురిసింది. పంట చేతికొచ్చి కోతులు కొనసాగుతున్న సమయంలో వర్షం కురవడంతో రైతులు ఆందోళన చెందారు. పలుచోట్ల ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. చిక్కడపల్లి, సులేమాన్‌నగర్, కోటగిరి తదితర ప్రాంతాల్లో ధాన్యం కుప్పలు పోశారు. ఎలాంటి నిబంధనలు లేకుండా తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

కొనసాగుతున్న దీక్షలు

బోధన్: బకాయి వేతనాలు చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఎన్డీఎస్ఎల్ కార్మికులు ఫ్యాక్టరీ గేటు ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 94 వ రోజుకు చేరాయి. దీక్షలో కార్మికులు బషీర్, అన్వర్‌మియా కూర్చున్నారు. లేఆఫ్ కాలం నాటి నుంచి తమకు రావాల్సిన బకాయిలు చెల్లించే వరకు దీక్షలు కొనసాగిస్తామని కార్మికులు చెప్పారు.

సమస్యలు పరిష్కరించే వారికే ఓటేయాలి

ఆర్మూర్‌టౌన్: సమస్యలను పరిష్కరించే వారికి ఓటు వేయాలని సీపీఎం ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేశ్ అన్నారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. అభ్యర్థులు ఇస్తున్న హామీలను చూడకుండా.. పని చేసే వారికి ఓటు వేయాలని సీపీఎం ప్రజలకు పిలుపునిచ్చిందన్నారు. రాష్ట్రంలో సీపీఎం 17 స్థానాల్లో పోటీ చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సీపీఎం పట్టణ కార్యదర్శి కుతాడి ఎల్లయ్య, డివిజన్ కమిటీ సభ్యులు భూమన్న, రవి, సిద్దల్ నాగరాజ్, కుల్దీప్‌శర్మ, నవీద్ తదితరులు పాల్గొన్నారు

ఏసీపీకి సన్మానం

ఆర్మూర్‌టౌన్: ఏసీపీగా ఇటీవల పదోన్నతి పొంది పట్టణంలోని తన ఇంటికి వచ్చిన మధనం గంగాధర్‌ను జీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. ఫౌండేషన్ సభ్యులు ఏసీపీకి శుభాకాంక్షలు తెలిపారు. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ నివేదన్, ప్రతినిధులు బెల్దారి శ్రీనివాస్, బోచ్కర్ వేణు, బోడమీది బాలకిషన్ పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై ఉన్న శివాలయాన్ని పెద్దసంఖ్యలో భక్తులు సోమవారం దర్శించుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీతపవన్ కుటుంబ సభ్యులు, నియోజక వర్గ ఇన్‌చార్జి ఆశన్నగారి రాజేశ్వర్‌రెడ్డి శివలింగానికి పంచామృతంతో అభిషేకం చేశారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలతో భక్తులు పల్లకీసేవ నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం వితరణ చేశారు. బి సుమన్, పీసీ గంగారెడ్డి, గంగాకిషన్, నక్కల లక్ష్మణ్, మల్లయ్య, అయ్యప్పశ్రీనివాస్, భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్ కార్మిక వ్యతిరేక పార్టీలు

వర్ని (మోస్రా) : బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కార్మిక వ్యతిరేక పార్టీలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశ్ విమర్శించారు. మోస్రా మండల కేంద్రంలో సోమవారం బీడీ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీలు పీఎఫ్ డబ్బులను షేర్ మార్కెట్లోకి మళ్లించి కార్మికులకు నష్టం కలిగించే విధంగా చట్టాన్ని తీసుకువచ్చారని ఆరోపించారు. కార్మికులందరికీ జీవనభృతి ఇవ్వకుండా అన్యాయం చేశారని ఆరోపించారు. కార్మిక వ్యతిరేక పార్టీలైన ఆ రెండు పార్టీలను అసెంబ్లీ ఎన్నికల్లో కార్మికులు ఓడించాలని పిలుపునిచ్చారు. కళ్యాణి, లలిత, స్వప్న, ఇంద్ర, భారతి, జమున, గంగలక్ష్మి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవీపేట : మండలకేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎస్ రాంరెడ్డి ఆదివారం రాత్రి మృతిచెందగా, బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే షకీల్ పరామర్శించారు. రాంరెడ్డి మృతదేహానికి సోమవారం నివాళులర్పించారు. బాధిత కుటుంబసభ్యులను ఓదార్చారు.

కాంగ్రెస్, బీజేపీలో చేరికలు

కమ్మర్‌పల్లి/బాల్కొండ/మోర్తాడ్/రెంజల్: బాల్కొండ నియోజకవర్గంలోని కమ్మర్‌పల్లి, ముప్కాల్, మోర్తాడ్‌కు చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. వారికి పార్టీ అభ్యర్థి ముత్యాల సునీల్ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఆర్మూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సరసం చిన్నారెడ్డి, టెలికం బోర్డు డైరెక్టర్ తక్కూరి సతీశ్, టీడీపీ సీనియర్ నాయకుడు ముస్కు ముత్తెన్న, మాజీ సర్పంచ్ పృథ్వి తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. కమ్మర్‌పల్లి, మోర్తాడ్, భీమ్‌గల్, వేల్పూర్, ఏర్గట్ల మండలాలకు చెందిన ఆయా పార్టీల నాయకులు కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లిలో బీజేపీ అభ్యర్థి అన్నపూర్ణమ్మ సమక్షంలో పార్టీలో చేరా రు. వారిని అన్నపూర్ణమ్మ బీజేపీలోకి ఆహ్వానించారు. రెంజల్ మండలం దూపల్లి బీఆర్ఎస్ సర్పంచ్ సాయారెడ్డి, విండో డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి బీజేపీలో చేరారు. వారిని మోహన్‌రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు.

ఆలయాల్లో వేముల దంపతుల పూజలు


వేల్పూర్‌లోని పెద్దమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి దంపతులు


జాన్కంపేటలో మంత్రి వేముల తరఫున ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

వేల్పూర్: బాల్కొండ నియోజకవర్గ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసేందుకు బయల్దేరే ముందు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తన సతీమణితో కలిసి వేల్పూర్‌లోని శ్రీ రామాలయం, పెద్దమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారివెంట డీసీసీబీ వైస్‌చైర్మన్ రమేశ్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు. జాన్కంపేటలో బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు.

బీఆర్ఎస్‌లో చేరిన మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు

మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు నీరడిభాగ్య రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఆమెతో పాటు యూత్ కాంగ్రెస్ నాయకుడు భూపాల్, భీమ్‌గల్ నుంచి కర్నె చిన్న గంగయ్య, చెక్కల నర్సింగ్, లింబాద్రి తదితరులు బీఆర్ఎస్‌లో చేరగా, మంత్రి వారికి గులాబీకండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రేగుల్లరాములు, కన్నె సురేందర్, పిట్ల సత్యం, బద్దం హరికిషన్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి గెలిపించాలి


చిక్కడపల్లిలో మాట్లాడుతున్న బాన్సువాడ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి

రుద్రూర్: బాన్సువాడ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంతోపాటు ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలన్నింటినీ పరిష్కరించానని, మరింత అభివృద్ధి కోసం మరోసారి గెలిపించాలని బాన్సువాడ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. రుద్రూర్ మండలం అంబం(ఆర్), అక్బర్‌నగర్, రాణంపల్లి, చిక్కడపల్లి, రాయకూర్, సిద్దాపూర్, రాయకూర్ క్యాంపు, సులేమాన్‌నగర్‌లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పోచారం మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 11వేల డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇచ్చామని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించామన్నారు. బీఆర్ఎస్ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఆయా గ్రామాల్లో పోచారానికి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అంబంలో దివంగత సీనియర్ నాయకుడు ఇందూర్ సాయిలు కూతురు సౌమ్య తమ కుటుంబానికి పోచారం శ్రీనివాస్‌రెడ్డి చేసిన సహాయాన్ని వివరిస్తున్న సమయంలో.. ఆయన కంట నీరు పెట్టుకున్నారు. చిక్కడపల్లి, అక్బర్‌నగర్‌ల్లో పోచారానికి మద్దతుగా వివిధ సంఘాల సభ్యులు ఏకగ్రీవ తీర్మాన ప్రతులను అందజేశారు. బాన్సువాడ సెగ్మెంట్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి పోచారం సురేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ నారోజీ గంగారాం, ఎంపీపీ సుజాతనాగేందర్, ఆయా గ్రామాల సర్పంచులు భాగ్య భూషణ్, గంగామణి ప్రసాద్, రోజాలక్ష్మణ్, పుష్పరమేశ్, నిర్మలారమేశ్, గంగారాం, లక్ష్మణ్, ఖాదర్, బీఆర్ఎస్ ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్మినెంట్ అంశాన్ని మేనిఫెస్టోలో చేర్చాలి


మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ అధ్యక్షుడు దాసు

పెర్కిట్(ఆర్మూర్): అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న పలు రాజకీయ పార్టీలు జీపీ కార్మికుల వేతనాలు పెంచి, వారిని పర్మినెంట్ చేస్తామనే అంశాన్ని వారి మేనిఫెస్టోల్లో చేర్చాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు దాసు డిమాండ్ చేశారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ ప్రాణాలను లెక్కచేయకుండా ప్రజారోగ్యం కోసం శ్రమిస్తున్న జీపీ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అందజేయాలన్నారు. అలాగే కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాన్ని కల్పిస్తూ కారోబార్లకు ప్రత్యేక హోదా కల్పించాలన్నారు. ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎంబీ ఖాజామొయినుద్దీన్, జేపీ గంగాధర్, నాయకులు సొప్పరి గంగాధర్, వెంకటపూర్ గంగారాం, రాజన్న, సర్వర్ లక్ష్మి, నాగమణి, ట్రాక్టర్ మల్లయ్య, నర్సు, చిరంజీవి, గంగా సాయిలు, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే పేదలకు న్యాయం



బాల్కొండ: బీజేపీ అధికారంలోకి వస్తేనే పేదలకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నపూర్ణమ్మ అన్నారు. మెండోరా మండలం సోన్‌పేట్, కోడిచర్ల, నెహ్రూనగర్‌లో అన్నపూర్ణమ్మ సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గంలో గంజాయి ని మంత్రితోపాటు ఆయన సోదరుడు పెంచిపోషించారని విమర్శించారు. పార్టీ మండల అధ్యక్షుడు సాయన్న, జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్, అసెంబ్లీ కన్వీనర్ మోహన్, నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నామినేషన్ల పర్వం


భీమ్‌గల్‌లో నామినేషన్ వేస్తున్న డీఎస్పీ అభ్యర్థి భోజన్న


ముత్యాల సునీల్ తరఫున నామినేషన్ పత్రాలను అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

భీమ్‌గల్/ఆర్మూర్: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతున్నది. బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి ముత్యాల సునీల్ తరుపున పార్టీ మండల అధ్యక్షుడు బొదిరె స్వామితోపాటు నాయకులు నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారిణి చిత్రామిశ్రాకు అందజేశారు. ధర్మసమాజ్ పార్టీ (డీఎస్పీ) అభ్యర్థిగా మంగళారం భోజన్న నామినేషన్ దాఖలు చేశారు. ఆర్మూర్‌లో మూడో రోజు రెండు నామినేషన్లు దాఖలైనట్లు రిటర్నింగ్ ఆఫీసర్ వినోద్‌కుమార్ తెలిపారు. ఆర్మూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ మ్యాక గంగాధర్ స్వతంత్ర అభ్యర్థిగా, ఆర్మూర్ మండలం అమ్దాపూర్‌కు చెందిన బొంట సాయన్న ఉత్తర రాష్ట్ర తెలంగాణ పార్టీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు.

త్యాగాల చరిత్ర కమ్యూనిస్టు పార్టీలది


అమరవీరులకు నివాళులర్పిస్తున్న నాయకులు

బోధన్: ప్రజల కోసం త్యాగాలు చేసిన చరిత్ర కమ్యూనిస్టు, విప్లవ కమ్యూనిస్టు పార్టీలదేనని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి పుట్ట వరదయ్య అన్నారు. పాలకవర్గ పార్టీలు అధికారమే లక్ష్యంగా పని చేస్తాయని, ప్రజల సంక్షేమంపై వారికి చిత్తశుద్ధి ఉండదని పేర్కొన్నారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ ఈ నెల 1 నుంచి 9వ తేదీ వరకు సంస్మరణ వారోత్సవాలు నిర్వహించాలని పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా సోమవారం పట్టణంలోని ఇఫ్టూ కార్యాలయంలో అమరవీరుల సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ డివిజన్ కార్యదర్శి వరదయ్య, ప్రజాసంఘాల నాయకులు సురేశ్, నజీర్, వినోద్, లక్ష్మణ్‌గౌడ్, భూమన్న, దేవీదాస్, సాయాగౌడ్, పేట సాయిలు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

మోర్తాడ్: వరంగల్‌లో ఈనెల 5న నిర్వహించిన గేమ్స్ ఫెడరేషన్‌లో సుంకెట్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. వివిధ పోటీల్లో విద్యార్థులు గోల్డ్ మెడల్స్ సాధించి పాఠశాలకు గుర్తింపు తీసుకొచ్చారని సర్పంచ్ కడారి శ్రీనివాస్ అన్నారు. విద్యార్థులతోపాటు వారికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయురాలు డి పుష్పలతను సోమవారం అభినందించారు. ఎస్ఎంసీ చైర్మన్ ప్రసాద్, హెచ్ఎం సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

పేదలకు ఇండ్లు నిర్మిస్తాం


దయాకర్‌రావును పార్టీలోకి ఆహ్వానిస్తున్న వినయ్‌రెడ్డి

మాక్లూర్: పేదలకు ఇండ్లు నిర్మించి ఇవ్వడం కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ అభ్యర్థి పొద్దుటూరి వినయ్‌రెడ్డి అన్నారు. మండలంలోని మెట్‌పల్లి, కొత్తపల్లి, గుంజిల్ల, చిక్లి, వల్లభాపూర్ గ్రామాల్లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చేతిగుర్తుకు ఓటువేసి తనను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు డేగ పోశెట్టి, గంగాధర్‌గౌడ్, కరిపె రాజేశ్వర్, పార్టీ అధ్యక్షుడు రవిప్రకాశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, ప్రచార కార్యదర్శి జైల్‌సింగ్, స్థానిక నాయకులు బి దయాకర్‌రావు, గూండ్ల మోహన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన సొసైటీ మాజీ చైర్మన్

మాక్లూర్ సహకార సొసైటీ మాజీ చైర్మన్ బాలపురం దయాకర్‌రావు వినయ్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్ఎస్ పాలనతో పాటు, స్థానిక ఎమ్మెల్యే వ్యవహార శైలి నచ్చక తిరిగి కాంగ్రెస్‌లో చేరుతున్నట్టు ఆయన వెల్లడించారు. దయాకర్‌రావుకు వినయ్‌రెడ్డి పార్టీ కండువాకప్పి ఆహ్వానించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈనెల 15న సీఎం కేసీఆర్ సభ


సభాస్థలిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే షకీల్

బోధన్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రెండో విడుత ప్రచారంలో భాగంగా ఈ నెల 15న సీఎం కేసీఆర్ బోధన్‌లో నిర్వహించనున్న ప్రజాఆశీర్వాద సభలో పాల్గొననున్నారు. ఈ మేరకు పట్టణ శివారులోని అంబం గేటు, నర్సాపూర్ ఆంజనేయ స్వామి ఆలయం ప్రాంతంలోని ఖాళీ స్థలాన్ని సభ నిర్వహణ కోసం ఎంపిక చేశారు. ఎమ్మెల్యే షకీల్ నాయకులతో కలిసి సోమవారం సభాస్థలిని పరిశీలించి భూమిపూజ చేశారు. ఎడపల్లి ఎంపీపీ శ్రీనివా స్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీంద్రయాదవ్, నాయకులు ఎంఏ రజాక్, సత్యం, ఎల్లయ్య యాదవ్, అంబం సర్పంచ్ గంగాప్రసాద్ ఉన్నారు.

శెట్‌పల్లిలో ఉచిత వైద్య శిబిరం



మోర్తాడ్: కరుణ ట్రస్ట్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని శెట్‌పల్లిలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 40 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఎనిమిది మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో సర్పంచ్ బద్దం గంగారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు డాక్టర్ శ్రీనివాస్, కరుణ ట్రస్ట్ అధ్యక్షుడు మహేశ్‌కుమార్, వైద్యులు ప్రసాద్, లయన్స్ క్లబ్ సభ్యులు చాకు లింగం, ప్రసాద్, బాలాజీ, వినీల్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ఒకే కాంట్రాక్టర్‌తో దోపిడీ



భీమ్‌గల్ : నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఒకే కాంట్రాక్టర్‌ను పెట్టుకొని దోపిడీకి పాల్పడ్డారని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి ముత్యాల సునీల్‌కుమార్ ఆరోపించారు. మండలంలోని బాచన్‌పల్లి, పల్లికొండ, పిప్రి గ్రామాల్లో సునీల్ సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద రూ.10లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తామన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలోని హామీలను నెరవేరుస్తామన్నారు.

కరపత్రాల విడుదల



మోర్తాడ్: ఈనెల 11న హైదరాబాద్‌లో నిర్వహించనున్న విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ మాదిగ దండోరా ఆధ్వర్యంలో సోమవారం మోర్తాడ్‌లో కరపత్రాలను విడుదల చేశారు. సభకు ప్రధాని నరేంద్రమోదీ ముఖ్యఅతిథిగా హాజరవుతారని నాయకులు తెలిపారు. మాదిగ జాతి ఆకాంక్షను నెరవేర్చుకునే సభకు మాదిగలు పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఎంఆర్‌పీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ సరికెల పోశెట్టి, నాయకులు మంద ప్రభాకర్, నాయకులు పాలెపు భూమేశ్, గుజ్జెటి లక్ష్మీపతి, ఉగ్గెర భూమేశ్వర్ పాల్గొన్నారు.

బోధన్‌లో కులసంఘాల సభ సక్సెస్

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నిర్వహించిన కులసంఘాల గర్జన సభ విజయవంతమైంది. పట్టణంతోపాటు నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి కులసంఘాల ప్రతినిధులు, సభ్యులు తరలివచ్చారు. జైతెలంగాణ నినాదాలతో హోరెత్తించారు. గాయని గంగ, యూట్యూబ్ సింగర్ శిరీష బృందాల ఆటపాటలు ఆకట్టుకున్నాయి. అతిథులను ఎమ్మెల్యే షకీల్‌తోపాటు కులసంఘాల ప్రతినిధులు సన్మానించారు. పొన్నాల లక్ష్మయ్య, కాసాని జ్ఞానేశ్వర్, ఎంపీలు రవిచంద్ర, బీబీ పాటిల్ హాజరయ్యారు. ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్సీలు వీజీగౌడ్, రాజేశ్వర్, జడ్పీ వైస్ చైర్‌పర్సన్ రజితాయాదవ్, ఏఎంసీ చైర్మన్ వీఆర్ దేశాయ్, పట్టణ అధ్యక్షుడు రవీందర్ యాదవ్, ఎంపీపీలు బుద్దె సావిత్రి, శ్రీనివాస్, సవిత, కౌన్సిలర్లు గంగారాం, కొండ్ర పద్మ, నాయకులు ఎల్లయ్య యాదవ్, బుద్దె రాజేశ్వర్, సంజీవ్‌కుమార్, రామ్మూర్తి, నర్సింగ్‌రావ్, గంగాధర్‌గౌడ్, కులసంఘాల ప్రతినిధులు నక్క లింగారెడ్డి, సుదర్శన్ గౌడ్, తౌకల గంగారెడ్డి, జ్ఞానేశ్వర్, సిర్ప సుదర్శన్, రేకం దాసు, జ్ఞానేశ్వర్, శేఖర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రాంగణ నియామకాలు

మాక్లూర్: డీఎస్ టెక్నాలజీ సంస్థ ప్రతినిధులు మండలంలోని దాస్‌నగర్‌వద్దగల విజయ్ రూరల్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ప్రాంగణ నియామకాలు చేపట్టారు. ఎండీఏ, బీటెక్ ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులను సంస్థ ప్రతినిధులు సత్యనారాయణ, హెచ్ఆర్ వర్షిణి ఎంపిక చేశారు. కళాశాల చైర్మన్ నరేందర్‌రెడ్డి, డాక్టర్ అమృతలత ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ గణేశ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నూతన పద్ధతుల్లో బోధించాలి

ఆర్మూర్‌టౌన్: ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంపొందించేందుకు 'పిల్లల కోసం తొలిమెట్టు' కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఆర్మూర్, భీమ్‌గల్ ప్రభుత్వ డిగ్రీకళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రోగ్రాం ఆఫీసర్లు వెంకటేశ్వర్లు, పి సుదర్శన్, ప్రిన్సిపాళ్లు వేణుగోపాలస్వామి, సతీశ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ ఆదేశాల మేరకు విద్యార్థుల డ్రాప్ అవుట్‌ను తగ్గించి హాజరు శాతాన్ని పెంచుతూ, ప్రాథమిక పాఠశాలల్లో ఐదో తరగతి వరకు విద్యార్థులకు కనీస అవగాహన కల్పించేందుకు తొలిమెట్టు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆర్మూర్‌లో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు వెంకటేశ్వర్లు, యాదగిరి, అనిత, భీమ్‌గల్‌లో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

నాది.. అభివృద్ధి, సంక్షేమ మంత్రం


చిన్‌రాజ్‌పల్లిలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

నందిపేట్(ఆర్మూర్): తనది అభివృద్ధి, సంక్షేమ మంత్రమని ఆర్మూర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం పదేళ్లుగా యంత్రంలా పనిచేస్తున్నానని బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. నందిపేట్ మండలం లక్కంపల్లి, చింరాజ్‌పల్లి, ఆర్మూర్ మండలం ఇస్సాపల్లి గ్రామాల్లో జీవన్‌రెడ్డి సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గత పదేళ్లలో ఆర్మూర్ నియోజకవర్గంలో అసాధ్యమనుకున్న పనులను సుసాధ్యం చేశానన్నారు. పదేళ్లలోనే వందేళ్ల అభివృద్ధి చేసి చూపించానని, 2014 కు ముందు అంధకారం ఆవహించిన ఆర్మూర్ నియోజకవర్గం నేడు అభివృద్ధి వెలుగులో మెరుస్తోందన్నారు. ప్రజల ఆశీర్వాదంతో తాను హ్యాట్రిక్ విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. అంకాపూర్ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో మామిడిపల్లి, ఇస్సాపల్లి గ్రామాలకు చెందిన పలువురు నాయకులు జీవన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

నిరసన..

లక్కంపల్లి సెజ్‌లో భూములు కోల్పోయిన బాధితులు జీవన్‌రెడ్డి రాకను వ్యతిరేకిస్తూ నిరసన తెలిపారు. జీవన్‌రెడ్డి గోబ్యాక్ అంటూ ఫ్లెక్సీలు ప్రదర్శించారు. నిరసనకారులకు, బీఆర్ఎస్ నాయకులకు మధ్య తోపులాట జరిగింది.

జీవన్‌రెడ్డి సతీమణి ప్రచారం

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూనే ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందించిన ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిని ఎన్నికల్లో గెలిపించాలని ఆయన సతీమణి రజితరెడ్డి కోరారు. మండలంలోని గోవింద్‌పేట్‌లో ఆమె ప్రచారం నిర్వహించారు.

బీఎస్పీతో సంక్షేమం

నందిపేట్ (ఆర్మూర్): బహుజన సమాజ్ పార్టీతోనే అట్టడుగు వర్గాల జీవితాలు మారుతాయని ఆ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొమిరే సుధాకర్ అన్నారు. నందిపేటలో సోమవారం ఆయన మాట్లాడారు. ఆర్మూర్ నియోజకవర్గంలో ఇప్పటివరకు ఏ పార్టీ కూడా అట్టడుగు ఉన్న బీసీ కులాలకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వలేదన్నారు. వడ్డెర సామాజిక వర్గానికి చెందిన గండికోట రాజన్నకు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ బీఎస్పీ టికెట్ కేటాయించారన్నారు. సమావేశంలో ఆర్మూర్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు సుంకరి నాగరాజ్, నందిపేట మండల అధ్యక్షుడు బొర్రల్ల సురేశ్, డొంకేశ్వర్ మండలాధ్యక్షుడు బంటు రాజేశ్వర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సుస్థిర అభివృద్ధి


బోర్గాంలో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి

రెంజల్/ఎడపల్లి/నవీపేట(బోధన్): కాంగ్రెస్ ద్వారానే సుస్థిర అభివృద్ధి సాధ్యమని మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి అన్నారు. రెంజల్, ఎడపల్లి, నవీపేట మండలాల్లో సుదర్శన్‌రెడ్డి సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అన్ని వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని పనిచేస్తుందని, చిల్లర రాజకీయాలు తమ పార్టీ నైజంకాదన్నారు. బీఆర్ఎస్ పాలనలో మంత్రులు, ఎమ్మెల్యేలు అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని, ప్రభుత్వ పథకాలను ఆ పార్టీ కార్యకర్తలకు అమ్ముకున్నారని ఆరోపించారు. బోర్గాం, రెంజల్ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సుదర్శన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఎడపల్లి గ్రామ వార్డు సభ్యులు పురం శేఖర్, గోపి కాంగ్రెస్‌లో చేరారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హామీలను నెరవేరుస్తాం



మాక్లూర్: అధికారంలోనికి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలను నెరవేర్చే బాధ్యత తనదని ఆర్మూర్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని మాణిక్‌బండార్, అమ్రాద్ గ్రామాల్లో రాకేశ్‌రెడ్డి సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గంలో రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయని, ఆర్టీసీ బస్సు సౌకర్యం లేని గ్రామాలు అనేకం ఉన్నాయన్నారు. మదన్‌పల్లి ఎంపీటీసీ గోవూరు ఒడ్డెన్న, పార్టీ మండల అధ్యక్షుడు సురేశ్‌నాయక్, గంగోనే సంతోష్, మాజీ జెడ్పీటీసీ లతాపీర్‌సింగ్, కల్లెడి సర్పంచ్ లావణ్యప్రసాద్‌గౌడ్, శివలాల్ పాల్గొన్నారు.

చేరికలు..

మండలంలోని గుంజ్లి సర్పంచ్ గుండారం శేఖర్‌తోపాటు అదే గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ అడేందర్, మాజీ సర్పంచ్ సుధాకర్ బీఆర్ఎస్‌ను వీడి బీజేపీలో చేరారు. అలాగే ముల్లంగి(బి), మాణిక్‌బండార్ గ్రామాల నుండి 60 మంది బీఆర్ఎస్ కార్యకర్తలు బీజేపీలో చేరగా రాకేశ్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – ఘోస్ట్- 10.15,
టైగర్ నాగేశ్వరరావు – 01.10
నరకాసుర (తెలుగు) – 04.35
ఘోస్ట్- 7.35
భగవంత్ కేసరి (తెలుగు) – 10.30

స్క్రీన్-2 – మా ఊరి పొలిమేర-2 (తెలుగు) – 10.25, 1.15, 7.30, 10.20
లియో (తెలుగు) – 4.05

స్క్రీన్-3 – కీడాకోలా – 11.20, 2.00,4.40,7.20, 10.00

స్క్రీన్-4 – భగవంత్‌కేసరి(తెలుగు)-12.45,6.35
విధి (తెలుగు)-4.10, శంకర్‌దాదా ఎంబీబీఎస్ – 10.00